క్లుప్తంగా

బైక్ యాత్రను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

భోగాపురం: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటంలో భాగంగా ఈనెల 21న జిల్లా కేంద్రం విజయనగరంలో చేపట్టే బైక్ యాత్రను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు స్థానిక ముక్కాం జంక్షన్ వద్ద మంగళవారం బైక్ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.రమణ, ఎం.రవి, అప్పారావు, చంద్రరావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుతున్న తరుణ తేజ, చైతన్య, గిరీష్ కుమార్, హేమంత్ కుమార్, రామాంజనేయ, నాగభరత్ అండర్–14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పతివాడ శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 21 నుంచి విజయవాడలో జరగనున్న పోటీల్లో వీరంతా పాల్గొంటారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



జిల్లా స్థాయికి ఎంపికైన వాలీబాల్ టీంతో మండల కోఆర్డినేటర్ నాగన్న

భోగాపురం: మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. మండల కోఆర్డినేటర్ నాగన్న ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. అండర్–14, 17 విభాగాల్లో వాలీబాల్, షటిల్ పోటీల్లో పలువురు క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల పోటీలు కొనసాగాయి. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన టీంలను జిల్లా స్థాయికి పంపిచనున్నట్లు నాగన్న తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



బాధితుని తండ్రికి నగదు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: మండలం జొన్నవలస గ్రామానికి చెందిన అట్టాడ రవితేజ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం తూర్పుకాపు సామాజిక వేదిక, తూర్పుకాపు ఉద్యోగులు రూ.1.10 లక్షలు విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతులమీదుగా మంగళవారం రవితేజ తండ్రి రాముకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాల్లో తూర్పుకాపు సామాజిక వేదిక, ఉద్యోగులు పాలుపంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సామాజిక వేదిక ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇతరులకు ఇబ్బంది కలిగించొద్దు



గణపతి మండపం వద్ద ఉత్సవ కమిటీ సభ్యులకు సూచనలు చేస్తున్న సీఐ తిరుపతిరావు

విజయనగరం టౌన్: ప్రజలకు ఇబ్బందులు కలిగించకుండా ప్రశాంత వాతావరణంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. స్థానిక వీటీ అగ్రహారం వద్ద ఏర్పాటు చేసిన గణపతి మండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. మతపరమైన విద్వేషాలు తలెత్తకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆయనతో పాటు ఎస్ఐ గణేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

జై జై గణేశ..!

నగరంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు ప్రధాన కూడళ్లు, వీధుల్లో మండపాలు ఏర్పాటు చేసి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. వివిధ రూపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులు భక్తులను ఆకట్టుకుంటున్నారు. గణపతి మండపాల వద్ద కోలాహలం నెలకొంది. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ కె.రాజేకుమార్, జిల్లా పరిషత్ సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు.

– సాక్షి విజయనగరం



విజయనగరం రూరల్: వినాయకునికి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



తోటపాలెం రోడ్డులో విద్యుత్ కాంతులతో ధగధగ మెరుస్తున్న మండపం



పూజలందుకుంటున్న బొజ్జ గణపతి



ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి తోటపాలెం వరకు విద్యుత్ కాంతులు



వేషధారణలలో కళాకారుడు



గాడిఖానా వద్ద శేషవాహనంపై పవళిస్తున్నట్లున్న గణపతి విగ్రహం

ఘనంగా ఎమ్మెల్యే అప్పలనాయుడు

పుట్టినరోజు వేడుకలు



డెంకాడ: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు, తదితరులు



డెంకాడ: ఎమ్మెల్యే అప్పలనాయుడుకు కేక్ తినిపిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



డెంకాడ: గంట్లాం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనాయుడు, కుటుంబ సభ్యులు



నెల్లిమర్ల: విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ



పూసపాటిరేగ: క్యాంపస్ ఛాలెంజ్‌లో దివ్యాంగులకు భోజనాలు పెడుతున్న వైఎస్సార్‌సీపీ నాయికులు

డెంకాడ: నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మోపాడలోని ఎమ్మెల్యే అప్పలనాయుడు స్వగృహంలో సందడి వాతావరణం నెలకొంది. ముందుగా గంట్లాం శ్రీశాంతి ఎస్టేట్స్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మోపాడలో జరిగిన పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు. డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో విచ్చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. భారీ కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణ రాజు(సురేష్‌బాబు), వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, డెంకాడ, భోగాపురం, పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బంటుపల్లి వాసుదేవరావు, ఉప్పాడ సూర్యనారాయణ, పి.అప్పలనాయుడు, చనుమల్లు వెంకటరమణ, డెంకాడ, నెల్లిమర్ల ఎంపీపీలు బంటుపల్లి వాసుదేవరావు, అంబళ్ల సుధారాణి, నెలిమర్ల, డెంకాడ జెడ్పీటీసీ సభ్యులు గదల సన్యాసినాయుడు, బడుకొండ లక్ష్మి, భోగాపురం, పూసపాటిరేగ జెడ్పీటీసీల ప్రతినిధులు పడాల భానుప్రకాష్, మహంతి జనార్దనరావు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు వేడుకల్లో పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం, విద్యార్థులకు స్టేషనరీ..

నెల్లిమర్ల: ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు వేడుకలు నెల్లిమర్ల పట్టణంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గంటా యువసేన ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గంటా సత్యనారాయణ(సతీష్) స్థానిక కన్యకా పరమేశ్వరి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. అలాగే స్థానిక ఆదిత్యా విద్యాలయంలో విద్యార్థులకు పరీక్ష సామాగ్రి కిట్లు అందజేశారు. చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్ మైపాడ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్.సురేష్, సతీష్, కృష్ణమోహన్, పి.పాపారావు, అప్పలరాజు, బి.శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఛాలెంజ్‌లో..

పూసపాటిరేగ: మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద ఉన్న క్యాంపస్ చాలెంజ్‌లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అక్కడ ఉన్న దివ్యాంగ పిల్లలకు ఎమ్మెల్యే అప్పలనాయుడు పేరిట భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, బడ్డుకొండ మణిదీప్‌నాయుడు, మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, బొల్లు రమేష్, ఎన్.సత్యనారాయణరాజు, డి.ఈశ్వరరావు, లంకలపల్లి రాజారావు, జనపాల అప్పారావు, టొంపల సీతారాం, శాంతాటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పరామర్శ



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి లక్ష్మీదేవిపేటలో ఇల్లు కోల్పోయిన బాధితులను ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు) మంగళవారం పరామర్శించారు. స్థానిక శ్రీరాజబంగారమ్మ గుడి దగ్గర రేకుల ఇంటిపై సోమవారం చెట్టు కూలడంతో ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఇంట్లోని వారంతా నిరాశ్రయులయ్యారు. బాధితులు కడియం సంతోషి, కుమారి, టి.లక్ష్మిని ఎమ్మెల్సీ పరామర్శించి, తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట నగరపంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిల వాసు, స్థానిక పెద్దలు నల్లి శ్రీను, పొండ్రంకి సత్యనారాయణ, తుమ్మ సత్యనారాయణమూర్తి తదితరులు ఉన్నారు.

నేడే ప్రారంభోత్సవం

పూసపాటిరేగ: మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ భవనాలను ఈ నెల 20న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ ఎం.రాధిక మంగళవారం తెలిపారు. పూసపాటిరేగలో గ్రామసచివాలయం–2, సీహెచ్ అగ్రహారంలో వెల్నెస్ కేంద్రం, చౌడువాడ వెల్నెస్ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్, బరిణికాంలో సీసీరోడ్డు, గోవిందపురంలో ఆర్‌బీకేను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

25 నుంచి రాష్ట్ర మహాసభలు

మెంటాడ(గజపతినగరంరూరల్): గుంటూరు జిల్లా బాపట్లలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను 25,26,27వ తేదీల్లో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ వ్యవసాయకార్మిక సంఘం అధ్యక్షుడు పురం అప్పారావు పిలుపునిచ్చారు. సంబంధిత గోడపత్రికలను మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. సాగుభూములు, సామాజిక న్యాయం తదితర అంశాలపై మహాసభ ల్లో చర్చించనున్నామని, రైతులు,కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం బొండపల్లి మండల అధ్యక్షుడు పి.కృష్ణబాబు, సభ్యులు జి.దేవుడు, సన్నిబాబు పాల్గొన్నారు.

విజేతలకు అభినందనలు



విజేతలను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం శేఖర్

విజయనగరం అర్బన్: సుపథ సంస్థ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలను స్థానిక గురజాడ స్కూల్ యాజమాన్యం మంగళవారం అభినందించారు. తెలుగు నేర్చుకుందాం, పద్య పఠనం, శ్లోక పఠనం, గేయాలు, వ్యాసరచన, ప్రహేళిక (క్విజ్) బహుళైచ్ఛిక ప్రశ్నావళి, వేదపఠనం తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన జీఎస్‌జీ కృష్ణశంకర్, ఆర్.జాహ్నవి, ఎస్.ఆశా భవానీ, సీహెచ్.రాధిక, ఎల్.వాత్సల్య, కే.మోదివి, ఎస్.లాస్యను పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్ఎం పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

డయేరియా విజృంభణ

- పినతాడివాడలో, గుణుపూరు గ్రామాల్లో పెరుగుతున్న కేసులు
- విస్తృతంగా వైద్యశిబిరాలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్



డెంకాడ పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న పినతాడివాడ డయేరియా వ్యాధిగ్రస్తులు

డెంకాడ: మండలంలోని పినతాడివాడ, గుణుపూరు గ్రామాల్లో డయేరియా విజృంభిస్తోంది. గొడిపాలెం గ్రామంలో ఇటీవల డయేరియాతో ఒకరు మృతి చెందగా..పలువురు ఆస్పత్రి పాలయ్యారు. ఇది మరువకముందే పినతాడివాడ, గుణుపూరులో డయేరియా కేసులు పెరుగుతున్నాయి. ఒక్క రోజు వ్యవధిలోనే 20 మంది వ్యాధి బారిన పడ్డారు. వారిలో ఒకరు మరణించారు. గ్రామంలో వైద్యాధికారులు పర్యటించి బాధితులకు వైద్య సేవలందిస్తున్నారు. పలువురిని డెంకాడ పీహెచ్‌సీకి, జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నట్లు డాక్టర్ పావని తెలిపారు. కలుషిత నీరు కారణంగానే వాధి ప్రబలి ఉంటుందని అనుమానిస్తున్నారు. గ్రామంలో ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకులతో పాటు డి.కొల్లాం వద్ద ఉన్న తాగునీటి ప్రాజెక్టు నుంచి గ్రామాలకు తాగునీరు సరఫరా జరుగుతోంది. దీంతో ఎక్కడైనా లీకేజీల కారణంగా నీరు కలుషితమౌతోందా అనే అనుమానాలు ఉన్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించారు. రక్షిత మంచినీటి ట్యాంకులను గ్రామ అధికారులు క్లోరినేషన్ చేయించారు. వ్యాధి నివారణకు తగు చర్యలు తీసుకుంటున్న అధికారులు తెలిపారు.



పినతాడివాడలో వైద్య సేవలపై డాక్టర్ పావని వద్ద వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

డీఎంహెచ్ఓ పరిశీలన

పినతాడివాడలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు సందర్శించారు. గ్రామంలో ఎంత మంది వ్యాధి బారిన పడ్డారు, వారు ఎక్కడెక్కడ వైద్య సేవలు పొందుతున్నారు, ప్రస్తుత పరిస్థితిపై ఆరా తీశారు. వైద్య అధికారులు, సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని వ్యాధి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



16వ డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

- శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 16, 48వ డివిజన్లలో రూ.40 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

విజయనగరం: నగరంలోని పలు వార్డులతో పాటు శివారు ప్రాంతాల అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. స్థానిక 16, 48వ డివిజన్లలో రూ.40 లక్షలతో నిర్మించిన రహదారులను నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, స్థానిక కార్పొరేటర్లతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అలాగే ఈ రెండు డివిజన్లలో కొత్తగా చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. 16వ డివిజన్‌లో భేరీచావడి వీధి, మజపతిరాయి ప్రాంతాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన రహదారులను వినియోగంలోకి తీసుకొచ్చారు. అలాగే 48వ డివిజన్ గాజులరేగులో రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్ మాట్లాడుతూ.. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రత్యేకించి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందుతుండడంతో ప్రజలందరూ చాలా సంతోషంగా ఉన్నారన్నారు. 16వ డివిజన్‌లో అనేక అభివృద్ధి పనులు చేపట్టినందుకు డివిజన్ ప్రజల తరఫున స్థానిక కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆసపు వేణు, 48వ డివిజన్ కార్పొరేటర్ నడిపల్లి ఆదినారాయణ, పార్టీ నాయకులు కణుగుల రాజా, జమ్ము మధు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అవినీతి రహిత పాలన

- కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్
- 50వ డివిజన్‌లో 'గడపగడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతిరహిత పాలనను అందిస్తున్నారని, ప్రభుత్వ పనితీరును చూసి ప్రజలు హర్షిస్తున్నారని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు. నగరంలోని 50వ డివిజన్ పరిధిలో మంగళవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లును అందజేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలువలు నిర్మించాలని స్థానికులు కోరడంతో.. సమస్యను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే కాలువల ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల నగదు జమచేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల కోసం జన్మభూమి కమిటీ చుట్టూ తిరగాల్సి వచ్చేదని, టీడీపీ కార్యకర్తలు, ఆ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే పథకాలు మంజూరయ్యేవని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని రానున్న ఎన్నికల్లో మరోసారి గెలిపించి మద్దతు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తోనంగి జగన్నాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయం



గంట్యాడ: రామవరంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' ఇంటింట సర్వేలో ఎంపీపీ హైమావతి

గంట్యాడ: ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష'లో భాగంగా వైద్యసిబ్బంది, వలంటీర్లు మంగళవారం చేపట్టిన ఇంటింటా సర్వేను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్కాగా సర్వే చేపట్టాలని వైద్య సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్య వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేయాలని చెప్పారు. అనారోగ్యంతో ఉన్న వారిని త్వరలో నిర్వహించనున్న మెడికల్ క్యాంపులకు తీసుకువెళ్లి వైద్యం అందించనున్నామని తెలిపారు. జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

బొండపల్లి: ఈనెలాఖరు నుంచి గ్రామాల్లో నిర్వహించనున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' మెడికల్ క్యాంపులను విజయవంతం చేయాలని, గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులను కోరారు. గొట్లాం గ్రామ సచివాలయంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జి పల్లి రఘుతో పాటు వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బొద్దల చిన్నంనాయుడు ఆధ్వ ర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు వైద్యసిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారం సేకరించాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు పార్టీ తరఫున ఉచిత బీమా సౌకర్యాన్ని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మీసాల తులసీరాం, ఎంఎల్‌ఓ జి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



బొండపల్లి: గొట్లాం సచివాలయంలో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రమణ